# చిరునవ్వుల సింహనాదం

ఇదే .... ఇరవై ముప్పయి ఏళ్ళ క్రితం అయినా, కనీసం తన స్వంత పాలెంలో అయినా భూపతికి ఇంతగా ఆలోచించవలసిన పనీ లేదు, అసలు ఇదో పెద్ద సమస్యా కాదు.

నలుగురు ముష్టి వెధవలు తనమాట ఖాతరు చెయ్యకపోవడమా? తన అరుపుల్నీ కేకల్నీ పెడచెవిన పెట్టి, తనని ఓ గడ్డి పరకగా తీసిపారేసి, పోపోవోయ్ నీ లెఖ్ఖేమిటి అన్నట్లు వికవికలూ, పకపకలూనా? అవతలివాడి అంతస్థేవిటి? ఆయన హోదా ఏవిటి అనే ఇంగితజ్ఞానం కాస్త .... కాస్తంటే కాస్తయినా కనిపించిందా వాళ్ల ప్రవర్తనలో?

ఇదంతా ఈ ప్రభుత్వం ఇచ్చిన కొమ్ములు. బీదవాళ్లూ, ముష్టివాళ్లూ అంటూ ఈ అలగాజనాని కంతకీ అలుసిచ్చి పడేసింది. ఆ రోజుల్లో ఎలా ఉండేదనీ – పెద్దా చిన్నా, భయం భక్తీ, హద్దూపద్దూ ఉండేవి. "ఆఁ!" అంటూ కళ్లెర్ర చేస్తే కాళ్లమీద వచ్చి పడేవారు.

తన పాలెంలో, ఒక్క పాలెంలో అన్నమాటేవిటి, చుట్టుపక్కల పది గ్రామాల్లో తన మాటకి తిరుగులేదు. అన్ని ఊళ్ళల్లోని అశేష జనం తనపేరు చెప్తే గడగడలాడే వారు.

తను ఆ రోజుల్లో వంద ఎకరాలకి అధిపతి – నిజంగా భూపతి. నలుగురు పాలేళ్లూ, నలుగురు దాసదాసీలూ, ఎప్పుడూ పొలంలో పనిచేసే పాతిక మంది కూలీలూ, వందలాది ఆశ్రితులూ – ఓహ్! అదో వైభవం. అదో దర్జా!

మతిలేని ప్రభుత్వాలూ, మాయదారి చట్టాలూ వచ్చిపడ్డాక ఆ ఎకరాలూ

పోయాయి, ఆ పరపతీ పోయింది. ఇవాళ ఎవర్ని ఎవరూ లెఖ్ఖచెయ్యరు – నువ్వెంత అంటే నువ్వెంత – ఈ పట్నాల్లో మరీను.

లేకపోతే ఏవిటి?

రెండేళ్లనుంచి సహిస్తున్నాడు – తన కాంపౌండ్ వాల్ బయట, ఆ రోడ్డు వార దెయ్యంలా పడిఉన్న ఆ బండనీ, ముష్టివెధవలు చేసే అల్లరినీను! అర్థరాత్రి అని లేదు. అపరాత్రి అని లేదు – ఒకటే కేకలూ, అరుపులూ, అల్లరీ, ఆగడం. అదేం అంటే? 'ఇది మా తాతముత్తాతల నుంచీ ఉన్న మా మకాం. ఈ బండమీదే పుట్టాం. ఇక్కడే పెరిగాం. మా చోట్లో మా ఇష్టం వచ్చినట్లు ఉంటాం – నవ్వుతాం, ఏడుస్తాం, కొట్టుకుంటాం, కలుసుకుంటాం. మధ్యలో వచ్చి మహల్ కట్టుకున్నది నువ్వు ..... ఇబ్బంది అయితే ఇల్లు ఖాళీ చేసి వెళ్లు' అన్నట్లు ఉంటోంది ఆ నలుగురి ప్రవర్తన.

ఆ డెకారింపు చూపులూ, ఆ నిర్లక్ష్యపు నడకలూ భూపతికి వంటిమీద తేళ్లూ, జెఱ్ఱులూ పాకినట్లుంటున్నాయి. ఇన్నాళ్లూ ఎలాగో సహిస్తూ వచ్చాడు. నిన్నటి గొడవతో తారస్థాయికి చేరుకొంది అతని కోపం.

అవును మరి! ఓర్పుకి కూడా ఓ హద్దు ఉంటుంది. తన అదలింపుని గడ్డి పరకగా తీసిపారెయ్యడమా? వికవికలూ – పకపకలూనా? పెద్దంతరం చిన్నంతరం ఉండక్కర్లే? నిన్నటినుంచి కోపంతో భగభగ మండిపోతున్నాడు భూపతి. అతి కష్టంమీద అణచుకొంటూన్న ఉద్వేగం రక్తపు పోటుగా మారి గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఒళ్లు వేడెక్కి; కళ్లు ఎరుపెక్కి దవడలూ, పెదిమలూ వణుకుతున్నాయి. శరీరం అంతా సెగలూ పొగలూ. దెబ్బతిన్న పులిలా, తోక తొక్కిన తాచులా ఉన్నాడు. వరండాలో అస్థిమితంగా పచార్లు చేస్తూన్న భూపతి కదులుతూన్న మంటలా కనిపించాడు పార్వతమ్మకి.

తన నలభై ఏళ్ల కాపురంలోనూ భర్త ఇంత భయానకంగా ఎప్పుడూ కనిపించ లేదు ఆమెకి. ఈ ఆవేశం, ఈ ఆగ్రహం ఏ అవాంతరానికి దారితీస్తుందో! ఈ వయస్సులో ఏ గుండెపోటో, పక్షవాతమో వస్తే .....

గుండె కలుక్కుమంది.

భయంతో వణికిపోయింది.

పైట చెంగు నోటికి అడ్డంపెట్టుకుని, గుడ్లనీరు కుక్కుకుంటూ "ఏవండీ!"

అంది పార్వతమ్మ దీనంగా. నిజానికి ఆ మాట గొంతు దాటి బైటికి రాలేదు. మెడమీద కత్తివేటు పడ్డప్పుడు మేకపిల్ల అరిచిన అరుపులా బాధ గొంతులోనే ఉండిపోయింది.

వరండాలో పచార్లు చేస్తూన్న భూపతి బోనులో తిరుగుతూన్న సింహంలా ఉన్నాడు.

దిటవు తెచ్చుకొని, ధైర్యం చిక్కబట్టుకొని "పోనిద్దురూ – ఆ అలగా జనంతో మనకేవిటి – ఆ విషయం మరిచిపోండి" అంది పార్వతమ్మ నెమ్మదిగా.

విసురుగా వెనక్కి తిరిగి మంటలా చూశాడు భూపతి ఆమెకేసి.

'అవును – అంతటితో మన పరువు పోయిందా? రోజులు ఎలా ఉన్నాయి? మనమే సర్దుకోవాలి.....' పార్వతమ్మ మాట ఇంకా పూర్తికాలేదు – 'హుఁ!' అని హుంకరించి పైమీద కండువా ఉయ్యాల బల్ల మీదకి విసిరికొట్టాడు.

"నా మాట వినండీ!" బతిమాలుతూ అంది పార్వతమ్మ.

"నువ్వు నోరు మూసుకుని లోపలికి వెళ్లు." అవి మాటలు కాదు – నిప్పులు, పిడుగులు.

ఆ రోజల్లా అస్థిమితంగా పచార్లు చేస్తూనే ఉన్నాడు, ఆలోచిస్తూనే ఉన్నాడు. ఉండుండి 'హుఁ!' అంటూ బుసలు కొడుతూనే ఉన్నాడు భూపతి.

చివరికి ఓ నిర్ణయానికి వచ్చి, తనకి క్లబ్బు పరిచయస్థుడైన స్థానిక ఎమ్.ఎల్.ఏ.కి ఫోను చేశాడు. ఆ సాయంత్రం వెళ్లి మాట్లాడికూడా వచ్చాడు. మర్నాడు అతని సలహా ప్రకారం జిల్లా కలెక్టర్‌ని, సూపరింటెండెంట్‌ని, మునిసిపల్ కార్పోరేషన్ మేయర్నీ, కమీషనర్‌ని, మంది మార్బలం ఉన్న మీసాల పోలయ్యనీ – విడివిడిగా కలుసుకున్నాడు. తర్వాత రెండు రోజులకి ఓ ఖరీదైన హోటల్లో అందర్నీ కలిపాడు.

ప్రభుత్వ బలం, అధికార బలం, కండబలం అన్నీ కలిసి, రకరకాల ఉపాయాలు చర్చించి, చివరికి సులువుగా, ఏ అల్లరీ అలజడీ లేకుండా, సమస్య పరిష్కారం అయ్యే మార్గాన్ని కనుక్కోగలిగాయి.

ఆ రోజు భూపతి చెల్లించిన హోటల్ బిల్లు రెండువేల అయిదు వందలు.

ఎంత ఖర్చయినా ఫరవాలేదు.

ఎంత శ్రమ అయినా లెఖ్క లేదు.

చేతికి మట్టి అంటుకోకుండా శని విరగడైతే చాలు.

పరువు నిలబడితే చాలు.

భూపతి మీసం దువ్వుకున్నాడు.

* * *

పట్నంలో ఆ వైపు పెద్దాసుపత్రికీ, ఇటు సినిమా హాలుకీ, ఆటు మార్కెట్‌కీ వెళ్లే మూడు రోడ్లూ కలిసే చోటుకి కొంచెం అటుగా పేవ్‌మెంటుని పూర్తిగానూ, రోడ్డుని కొద్దిగానూ ఆక్రమించుకొని ఉన్న ఆ బండరాయి ప్రగతికి ప్రతిబంధకంలా, అభ్యుదయానికి అడ్డంకిలా ఎన్ని వందల ఏళ్ల నుంచో అక్కడ పడిఉంది. ఐదు అడుగుల వెడల్పూ, పది అడుగుల పొడవూ ఉన్న ఆ నల్లబండమీద శేషతల్పశాయిలా నడ్డి వాల్చి వెల్లకిలా తిరిగి ఆకాశంకేసి చూస్తే ఏ బాదర బందీ లేకుండా హాయిగా స్వేచ్ఛగా "అపనా తనా మనా" అంటూ పాడుకుంటూన్న సింహాచలం పాట, శంకరం కేకతో చటుక్కున ఆగిపోయింది. అంట్ల కుండనీ, పులుసు చట్టీనీ కడిగి ఆ అంటు నీళ్లని రోడ్డుమీద పారబోస్తున్న రావులమ్మ కూడా ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది.

ముష్టి చిప్పా, చేతి కర్రా, బండరాయిని ఆనుకొని ఉన్న ఖరీదైన కాంపౌండు వాల్‌కి జేరేస్తూ, "అయిపోయిందిరా. చెల్లిపోయింది, సివ్వాచలం! మనకీ, ఈ బండ రాయికీ ఋణం చెల్లిపోయింది" అన్నాడు శంకరం.

బందరు తూటా వచ్చి ఒళ్ళో పడ్డట్టు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు సింహాచలం.

"ఏంటిరా? ఏంటైంది?" అంటూ రావులమ్మ కంగారు పడుతూ అడిగింది. కాని, సింహాచలం మాత్రం ఏం అడగలేదు. కాస్సేపు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. అంతే, తర్వాత మళ్లీ వెల్లకిలా పడుకుని తలకింద ఉన్న అల్యూమినియం కంచం చేతిలోకి తీసుకుని దానిమీద తాళం వేస్తూ తిరిగి పాట అందుకున్నాడు" అపనా తనా మనా, మారోరి బైరన్న" అంటూ.

"ఛట్. ఆపరా ఎదవ పాటాను, నువ్వూనూ. అవతల కొంపలంటుకు పోతున్నాయంటే ఇనిపించుకోవేం?"

"ఓరినీ! మనకి కొంప అంటూ ఉంటేగదరా అంటుకుపోవడానికి?" కటకటమంటూ నవ్వాడు సింహాచలం.

"ఈ బండరాయి మన కొంప కాదేంటి?" అంది రావులమ్మ.

"అదీ - అలా అడుగు" అన్నాడు శంకరం.

"కొంపే! కాని ఇది అంటుకోడమేట్రా ఎర్రి మొగమా!"

"అంటుకోకపోతే బద్దలైపోతుంది. బద్దలు కొట్టేస్తారు."

సింహాచలం అదిరిపడి లేచి కూర్చున్నాడు.

"ఎవరు? ఎవర్రా దీన్ని బద్దలు కొట్టేది?"

"ఓరినాయనోయ్! బండపోతే బతుకుపోద్ది. ఇంక ఎక్కడ మనం తల దాచుకొనేది!" శోకన్నాలు మొదలెట్టింది రావులమ్మ.

"ఛస్ – ఊరుకో. ఏడవడవూ, నువ్వూను. ఏంటిరా! ఎవరు?... దీన్ని బద్దలు కొట్టేది?"

"ఆళ్లే – మునిసిపాల్టీఓళ్లు – ఈ మద్దెన కాపరేషన్ అయింది కదా అది – ఆళ్లు".

సింహాచలం హుషారు ఎగిరిపోయింది, మత్తు దిగిపోయింది. ఆ మాటతో కాళ్లు రెండూ కూడదీసుకుని బాసం పట్టేసుక్కూచుని శంకరం మొహంలోకి చూస్తూ "ఏంటి? ఆళ్లు బద్దలు కొట్టేస్తారా మన బండని? ఎందుకు? ఏటైందనీ?" అన్నాడు.

"ఇక్కడ రద్దీ ఎక్కువైందట. రోజూ సిటీ బస్సులూ, కార్లూ, బళ్లూ, సైకిళ్లూ ఒకదా న్నొకటి గుద్దుకుంటున్నాయట".

"అయితే!"

ఈ బండ కొట్టేస్తే రోడ్డు ఎడల్పు అయి ఇరుకు తగ్గుతుందట. ఈ బండరాళ్లతో అక్కడ మద్దెలో పోలీసు నుంచోడానికి ఐలెండో ఏదో కడతారట".

"నీకెలా తెలుసు?"

"నాలుగు రోజుల క్రితం మునిసిపాలిటీవోళ్లు వచ్చి చెప్పిపోయారు. ఈ బండ కాళీ చెయ్యమని. నువ్వు లేవు. నిన్న ఇంకోళ్లెవళ్లో వచ్చి కొలతలూ అవీ కొలుసు కెళ్లారట. కుంటి ఈరాసామి లేడూ – ఆ ఓటల్ ముందు అడుక్కుంటూ ఉంటాడు? ఆడు సెప్పాడు. ఇప్పుడు నేను వస్తూంటే పోలయ్య మడుసులు ఆపి అడిగారు – 'ఏరా మీరాబండ కాళీసెయ్యరా? ఆదివారంలోగా సెయ్యకపోయారో బండతోబాటు మీ బుర్రలు కూడా బద్దలవుతాయని' అంటూ."

సింహాచలం ముఖంలో చీకట్లు అలుముకున్నాయి.

"నిజంగా బద్దలు కొట్టేస్తారంటావా?"

"అదే గదరా నే నంటుంది"

"మరిగయితే మన మాటేంది? ఇంతప్పటి నుంచి మనం అంతా ఈ బండ తల్లి ఒళ్లో తల పెట్టుకుని పడుకుంటున్నాం. హోరున వాన కురిసినప్పుడూ, ఫెళ్లున ఎండ కాసినప్పుడూ తప్ప, మన నీ బండే కదరా ఆదుకుంటోంది? మన గుడీ గుడిశా అంతా ఇదే! సెప్పరా శంకరం!" కన్నీళ్లు కారుస్తూ శంకరం చేతులు పట్టుకున్నాడు సింహాచలం.

"నా నేటి సెప్పేది? మొన్నటిదాకా ఆ కలెట్టరాఫీసు గోడవారని గోను పట్టాలు కట్టుని ఉంటూన్న మనోళ్లకు ఆ గవన్నమెంటోడు ఆ పట్టాలు పీకేస్తే ఏం చేశారు? ఊరు బైటికి పోయారు – మనమూ అంతే....."

"నేను పోలేన్రా – ఈ బండ వొదల్ను. నా బతుకిక్కడ తెల్లారిపోవాలి."

"ఓరి మొండోడా? నువ్వంటే ఉండు – నేనూ, రావులమ్మా పోతాం. మన సుబ్బిగాడు అడి సామానంతా ఆ గోతాంలో నిన్ననే ఏసి మూట గట్టుకుని రెడీగా ఉన్నాడు. మాం ముగ్గురం పోయాక, ఆళ్లు ఒచ్చి నిన్ను లాగి అవతల పడేసేదాకా ఈ బండని కౌగిలించుకొని కూసో....."

"అది కాదురా" అంటూ ఆపైన మాట్లాడలేక చంటి పిల్లాడిలా కళ్లనీళ్లు పెట్టుకొని కూర్చున్నాడు సింహాచలం.

"ఓరి పిచ్చి సన్నేసీ! అధికారులకి బలం ఉంది. శక్తి ఉంది. అన్నీ ఉన్నాయి. మనకేటి ఉంది? పోనంటే ఊరుకుంటారా. ఈడిసేత్తారు. అందుకని నా మాటిను – ఆనక ఏడవడంకంటే ఇయాళో రేపో ఇంకో సోటు సూసుకుందాం. ఆదివారం అంటే ఇంకా మూడురోజు లుంది గడువు."

"తప్పదంటావా? ఓరి దేవుడోయ్! ఏ సుప్పునాతోళ్లకి ఏం పుట్టిందోకానీ ఈ బుద్ధి" అంటూ సింహాచలం ఇంకా రోజు ముప్టికి వెళ్లకుండా, లోపల కడుపు కాలిపోతూన్నా, పైన ఎండ మాడిపోతున్నా ఆ బండరాయిని కౌగిలించుకొని, మధ్యమధ్య బోరున ఏడుస్తూ ఆ మట్టున అలా ఉండిపోయాడు.

తిండిలేక కడుపూ, ఎండబడి ఒళ్లూ రెండూ కాలిపోతున్నాయి. ఏవైనా వెళ్లకూడదనే మొండితనం, వెళ్లక చేసేదేవిటి అనే పిరికితనం, వీటి మధ్య ఆలోచన తెగక తల బద్దలైపోతోంది.

సాయంత్రం అయింది.

ముష్టికెళ్లిన శంకరం, రావులమ్మా ఇంకా తిరిగి రాలేదు.

రెండు చేతుల్లోనూ తల పెట్టుకుని కూర్చున్నాడు. ఆలోచించి ఆలోచించి అలిసిపోయిన బుర్రమీద సుత్తులతో కొడుతున్నట్లు విపరీతమైన తలపోటు – పొద్దుటి నుండి తిండిలేదేమో, కాళ్లూ చేతులూ పీకేస్తున్నాయి. నరాలు తోడేస్తున్నాయి. నానా యాతనగా ఉంది – కూర్చోలేడు, నుంచోలేడు.

ఒకటే అస్థిమితం. ఒకటేబాధ. ఒకటే ఆలోచన.

ప్రాణం లేని కట్టెలా కాస్సేపూ, నాలికలు జాపి ఎగసిపడుతున్న మంటలా కాస్సేపు వేగిపోయాడు.

అలా ఉండి ఉండి చివ్వున లేచాడు సింహాచలం. లేచి తన సత్తు కంచం, చిరుగుల మూటా గోనెపట్టాలో చుట్టి బండకి ఓ మూల పెట్టాడు.

బండ నెరదల్లో అక్కడక్కడ దాచిన డబ్బు తీసి లెఖ్ఖ పెట్టాడు. పదకొండు రూపాయల పావలా ఉంది. తీసి రొంటిని పెట్టుకుని బయలుదేరాడు. ఓ గమ్యం లేదు. ఫలానా చోటుకని లేదు, కాళ్లు ఎక్కడికి తీసికెళితే అక్కడికి.

ఊరి కోమూల ఉన్న చావుల దిబ్బ దగ్గర రోడ్డువారని, రాళ్లు కొట్టి రోళ్లూ తిరగల్లూ తయారు చేసేవాళ్ల గుడారాల దగ్గర ఆగాడు.

లంబాడీ ఆడవాళ్లు రంగు రంగుల గుడ్డల్లోనూ, అద్దాలగాజుల్లోనూ, పూసల నగల్లోనూ మిలమిలా మెరిసిపోతున్నారు. మొద్దుల్లా బండల్లా ఉన్న రాళ్ళన్నీ వాళ్ళ ఉలిచెక్కుడికీ, సుత్తి దెబ్బలకీ ఒంగిపోయి రుబ్బురోలుగానో, సన్నికల్లు ఆకారంగానో మారుతున్నాయి.

వాళ్ల పనితనంకేసి పరిశీలనగా చూస్తూ నిలబడ్డ సింహాచలాన్ని ఓ పదహారేళ్లపడుచు పలకరించింది – "ఏం కావాలయ్యా? నీకు? రుబ్బురోలా? సన్నికల్లా? పొత్రమా?" అంటూ.

సింహాచలం తడబడి "అబ్బే – ఏం లేదు. మీరు ఇవేనా... బొమ్మలు ఏవైనా చేస్తారా?" అని అడిగాడు.

ఆ అమ్మాయి తెల్లగా వెన్నెలలా నవ్వి, "బొమ్మలా? మేమా? అదిగో – సన్నికెల సెయ్యరా అంటే, మా తమ్ముడు సెక్కిపడేశాడు. ఆ మూల ఆ రాయిని – అది రాయో రాక్షసో – అట్టా ఉంటాయి మేం బొమ్మలు సెక్కడం అంటే....."

పగడాలు విరజిమ్మినట్లు పకపకా నవ్వింది.

సింహాచలం ఆ సగం చెక్కిన రాయికేసి చూశాడు. అదే పనిగా చూశాడు. ఆశ్చర్యం వేసి కళ్ళు నులుముకొని మరీ చూశాడు. తను పొరబడుతున్నానా అని దగ్గరగా వెళ్లి చూశాడు. ఏం అనుమానం లేదు. ఆ రాయిని తన కిమ్మన్నాడు. లంబాడీ అమ్మాయి సింహాచలాన్ని ఎగాదిగా చూసి "ఎందుకు? ఏం చేసుకుంటావు?" అంది.

సింహాచలం మాట్లాడలేదు.

"కావలిస్తే పట్టికెళ్లు - అయిదు రూపాయిలిచ్చి".

"పదిస్తాను. కొంచెం ఆ కళ్ల దగ్గరా, మూతి దగ్గరా చెక్కి సర్ది ఇయ్యి" అన్నాడు.

పది రూపాయలు చేతిలో పెట్టి, ఆ రాయికి దణ్ణం పెట్టి, ఎంతో భక్తితో నెత్తిమీద పెట్టుకుని వెళుతూన్న సింహాచలాన్ని పిచ్చివాణ్ణి చూసినట్టుగా చూసి జాలితో నిట్టూర్చింది లంబాడీ పిల్ల! సిరంజీవి సినిమాని పరుపుల టిక్కెట్లో కూసుని సూడొచ్చు అన్న సంబరాన్నికూడా కాస్సేపు మర్చిపోయి.

"సామీః! నాకు ఇంక మిగిలిన ఆస్థీ మాస్థీ ఈ రూపాయి పావలా, నువ్వూను. ఈ సిల్లర కూడా నీమీదే పెట్టుబడి పెడతా. నా బతుకుని కూడ నీ సేతిలో పెడుతున్నా- ఎలా చూసుకుంటావో నన్నూ, నా మకాంనీను. ఇయ్యాలనుంచి ఆ మకాం నీది - నాది కాదు. ఈ రావణాసురులతో నేను వేగలేను. నాకు డబ్బా? బలమా? పదవా? పదిమంది బరోసానా? ఏ వుంది సెప్పు. ఈ దెయ్యపు మడుసుల నుంచి నన్నూ, నిన్నూ నువ్వే కాపాడుకోవాలి" అంటూ సింహాచలం తనలో తనే గొణుక్కుంటూ పోతూంటే, ఏం అర్థంకాక బుగ్గమీద వేలేసుకుని చిత్రంగా చూస్తూ ఆమట్టునే నిలబడి పోయింది లంబాడీ అమ్మాయి.

* * *

"విడ్డూరం కాకపోతే - నిన్నటిదాకా లేని ఆంజనేయ స్వామి ఇవాళ ఎక్కడ నుంచి ఊడిపడ్డాడు? వెలిశాడట వెలిశాడు" అన్నాడు పళ్లు పటపటా కొరుకుతూ పోలీసు సూపరెంటెండెంటు.

"ఇదంతా ఆ దొంగనాయాళ్లు ఏసిన ఎత్తూ, ఆడుతూన్న నాటకమూను! మీరు ఊఁ, అనండి-రేపీపాటికి లేపేస్తాను ఆ స్వామినీ, ఆ ఆసామీలనీను" అన్నాడు మీసం మేలేస్తూ పోలయ్య.

"తొందరపడకు పోలయ్యా! ముందు నువ్వు కూర్చో" అన్నాడు కార్పోరేషన్ మేయరు.

'అనుమానం లేదు. ముష్టాళ్లప్లానే ఇది. దేవుణ్ణి అడ్డంవేసి మన చేతుల్ని కట్టెయ్యాలని చూస్తున్నారు" అన్నాడు కమీషనరు.

"మీన మేషాలు లెక్కిస్తారేవిటండి, అనుకున్న ప్రకారం మనుష్యుల్ని పంపించి బండ బద్దలు కొట్టించెయ్యక?" అంటూ అరిచాడు భూపతి.

"ఆగండి భూపతి గారూ! మీ మాట పట్టుకుని ఎమ్.ఎల్.ఏ. గారి భరోసా చూసుకుని, రోడ్లు వెడల్పు చెయ్యాలనే సాకు చూపించి ఇంత వరకూ వేసుకు వచ్చాం ప్లాను. ఇప్పుడది ఎదురు తిరిగింది" అన్నాడు జిల్లా కలెక్టరు.

"ఏం తిరగలేదు – మన భయమే కాని" అన్నాడు భూపతి నిష్ఠూరంగా.

"మీకేం? మీ రేదైనా చెప్పొచ్చు. కాని పరిస్థితి ఎదురు తిరిగి లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వచ్చి కాల్పుల దాకా దారితీస్తే మెడకి ఉచ్చు బిగిసేది నాకు" అన్నాడు మేయరుకేసి చూస్తూ కలెక్టరు.

"అవునవును.... నా మనుష్యుల్ని పంపించి, వాకబు చేయించాను. ఒకటే జనం – ఒకటే తీర్థప్రజట! మనం తొందరపడితే కొంపలు మునిగిపోతాయి.. సెంటిమెంటా, మజాకా? నా మట్టుకి నాకు దీన్ని ఇంతటితో వదిలేసి, ఈ సంగతి మరిచిపోవడం మంచిదనిపిస్తోంది" అన్నాడు మేయర్ – కష్టపడి సంపాదించిన పదవికి ఎక్కడ చలనం కలుగుతుందో అని భయపడుతూ.

"దట్సాల్‌రైట్ – ది మేటర్ ఈజ్ డ్రాప్డ్. సూపరెంటెండెంట్ గారూ! ఆ బండ దగ్గరికి వందలాది జనం వస్తున్నారట ప్రొద్దుటా, సాయంత్రం. ట్రాఫిక్ జామ్ కాకుండా, లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం రాకుండా చూసుకోండి. అక్కడో ఇద్దరు పోలీసులకి డ్యూటీ వెయ్యండి అవసరం అయితే" అంటూ కలెక్టర్ లేచాడు.

అలా ముగిసిన ఉన్నతాధికార్ల సమావేశంనుంచి బయటికివస్తూ "ఛీ.... ఛీ..... ఇంత ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం, మందీ మార్బలం ఇదంతా ఉండీ కూడా ఏం చెయ్యలేక, వాడెవడో పన్నిన యుక్తికి తల వంచి నోరు మూసుకుని ఊరుకోవడమా?" అంటూ అరిచాడు భూపతి.

"యుక్తిని కాదండీ – ఒక మహాశక్తిని విసిరాడు వాడెవడో" అన్నాడు మేయర్....

"అవును..... అంతేలెండి.... పరిస్థితులు కలిసిరానప్పుడు సర్దుకుపోవడమే వివేకం. ఆంజనేయుడు వెలవడం కాదుకానీ, ఇప్పుడు నా ప్రాణానికి వచ్చింది - అక్కడ బందోబస్తూ, ట్రాఫిక్కూ ఎలా ఏడిసిందో" అంటూ విసుక్కుంటూ జీప్ ఎక్కాడు పోలీసు సూపరెంటెండెంట్.

రాత్రి పది దాటింది. భక్తులందరూ వెళ్లిపోయారు. దీపాలు కొడిగడుతున్నాయి. ప్రొద్దుటినుంచి కోలాహలంగా ఉన్న వాతావరణం అంతా సద్దుమణిగింది. మర్నాటికి కావలసిన పళ్లూ, కుంకుమా, ఇతర పూజా ద్రవ్యాలూ కొని పట్రావడానికి వెళ్లిన రావులమ్మ ఇంకా తిరిగి రాలేదు. కొట్టిన కొబ్బరికాయ చెక్కలు కొట్లో ఇచ్చి రావడానికి గోతం పట్టుకొచ్చి అందులోకి ఎత్తుతూ "మొత్తానికి సివ్వాచలం! పంతం నెగ్గించుకున్నావురా - బండరాయి వదలనన్నావు - ఇప్పుడు నువ్వు వదలుతానన్నా ఈ రాయీ రాతిబొమ్మా నిన్ను వదలవు" అన్నాడు శంకరం.

కాషాయ బట్టలు విప్పి, మెళ్లో రుద్రాక్షలు పక్కన పెట్టి చిరిగిపోయిన గళ్లలుంగీ చుట్టబెట్టుకుంటూన్న సింహాచలం కాస్సేపు మౌనంగా ఉండి "అయినా మందే ముందిరా. అదిగో - అంతా ఆ దేవుని దయ" అంటూ ఓ చిరునవ్వు నవ్వాడు.

సరిగ్గా అప్పుడే జరీ చీర కొంగు భుజాల మీంచి తీసుకుని, శాలువా కప్పుకొని భర్త ఆరోగ్యాన్ని కోరుకుంటూ, ఆంజనేయ స్వామి విభూతి కోసం గుట్టుగా వస్తూన్న పార్వతమ్మకి ఆ చిరునవ్వు సింహనాదంలా వినిపించింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 22-1-1997)

*